కాంగ్రెస్‌ది నయవంచక పాలన

సిద్దిపేట: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జంకిలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

జగదేవపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, డిసెంబర్ 6: బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను గృహ నిర్బంధం చేసి రేవంత్ రెడ్డి నయవంచక పాలన చేస్తున్నారని ఆపార్టీ నాయకులు బెదురు తిరుపతి, అనగోని పరుశురామ్‌గౌడ్, శనిగరం బాబు అన్నారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అవినీతి అక్రమాలపై మాట్లాడుతున్న ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలపైన ప్రభుత్వం కేసులు పెట్టి అణిచివేసే కుట్ర చేస్తున్నదన్నారు. ప్రభుత్వం పెడుతున్న కేసులు, గృహ నిర్బంధాలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు మల్లేశం, ఎండీ గఫూర్, పరశురాములు, అనిల్, చింటూ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో భయపెట్టలేరు

గజ్వేల్, డిసెంబర్ 6: అక్రమ అరెస్టులతో ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలను భయపెట్టలేరని ఆపార్టీ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రావు అన్నారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు తీసుకోకుండా పోలీసులు అతడిపైనే కేసులు పెట్టడాన్ని తెలంగాణ సమాజం గమనిస్తున్నదన్నారు. ఇలాంటి కేసులు బీఆర్ఎస్ నేతలకు కొత్తేమి కాదని అక్రమంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి మన్ననలు పొందాలి కానీ కక్షపూరితంగా వ్యవహరించాలని చూడటం దుర్మార్గమన్నారు. నేటికీ అమలుకాని హామీలు, పంట రుణమాఫీ, రైతుబంధు, మహిళలకు రూ. 2500, గ్యాస్ సబ్సిడీ, రూ.4వేల పింఛన్, కౌలు రైతులు, ఆటో కార్మికులకు ఆదుకోవడం వంటి పథకాలు చాలా ఉన్నాయన్నారు.

హామీలు అమలు చేయకుండా ...

జగదేవపూర్, డిసెంబర్6: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విజయోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు మంగళం పాడిందని, కల్యాణ లక్ష్మికి తులం బంగారం ఊసేలేదన్నారు. మహాలక్ష్మి రూ.2500 జాడలేదన్నారు. హామీలు అమలు చేయకుండా విజయోత్సవాలు చేయడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నదన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బుద్దనాగరాజు, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, నాయకులు కనకయ్య, మశ్చగణేశ్, భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.

తెలంగాణ ద్రోహి రేవంత్ రెడ్డి

చిన్నకోడూర్, డిసెంబర్ 6: తెలంగాణ ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డి అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ ఆరోపించారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ ములకల కనకరాజు, వైస్ ఎంపీపీ కీసరి పాపయ్యతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి దుర్మార్గపు పాలన కొనసాగిస్తున్నాడని మండిపడ్డారు. ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి అక్రమ అరెస్టులు, నిర్బంధాలు కొనసాగిస్తున్నారన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారెంటీలు, 420 వాగ్దానాలను అమలు చేయాలని హితవు పలికారు.

ప్రశ్నిస్తే అరెస్టు చేయడం తగదు

బెజ్జంకి, డిసెంబర్ 6: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అడిగితే అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం తగదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి అక్రమ అరెస్టులకు నిరసనగా మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పేదలకు చేస్తున్న అన్యాయాన్ని నిలదీస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావుపై అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటన్నారు. తన ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పీఎస్‌కు వెళ్తే ఆయనపై అక్రమ కేసులు పెట్టి వేధించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తుంటే అడ్డుకోవడం నియంతృత్వపాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, చింతకింది శ్రీనివాస్‌గుప్తా, కచ్చు రాజయ్య, ముక్కిస తిరుపతిరెడ్డి, గుభిరే మల్లేశం, రాజిరెడ్డి, స్వామి, శ్రీధర్, నరేశ్, రాజు, తిరుపతి, మహేశ్, రమేశ్, కిష్టయ్య, మోహన్, దుర్గ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

బాలసదనంలో చిన్నారితో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 6: చిన్నారులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జడ్జి స్వాతిరెడ్డి సూచించారు. సిద్దిపేట బాలసదనాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతకుముందు బాల్యవివహాలపై చిన్నారులు నాటిక ప్రదర్శించారు. అనంతరం శిశుగృహాన్ని సందర్శించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ జిల్లా అధికారి రాము, భాగ్య, రాజు, న్యాయసేవా సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), డిసెంబర్ 6: అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లికి చెందిన బాధితురాలు బొడ్డు మల్లవ్వకు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రూ.7,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. రోడ్డు ప్రమాద బాధితులు రాజు, పరశురాములు, మంగళి సాయిలును పరామర్శించారు. మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్, గ్రామస్తులు శ్రీనివాస్, మహేశ్, సన్నిత్, సాయి, జగన్ పాల్గొన్నారు.

అనన్యకు అభినందనల వెల్లువ

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), డిసెంబర్ 6 : అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని ఖాజీపూర్ జడ్పీ పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థిని కే.అనన్య ఎస్‌జీఎఫ్ అండర్-17వ విభాగం నెటబాల్ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ నెల 11వ తేదీ నుంచి పంజాబ్ రాష్ట్రంలోని లుధియానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నది. శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కే.అనన్యను అభినందించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనన్యను అభినందిస్తున్న బక్కి వెంకటయ్య

చెత్తను వేరుచేసి విడిగా అందించాలి

తడి పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, డిసెంబర్ 6: మున్సిపాలిటీలోని ప్రతి ఒక్కరూ చెత్తను వేరు చేసి విడిగా అందించాలని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అన్నారు. శుక్రవారం ఆయా వార్డుల్లో తడి, పొడి చెత్తపై ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీని శుభ్రంగా ఉంచాలని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. చెత్తను ఖాళీ ప్రదేశాల్లో పడేయకుండా చెత్తబండికి ఇవ్వాలన్నారు. తడి, పొడి చెత్తతో కలిగే ప్రయోజనాలను తెలుపడంతో పాటు వ్యక్తిగత శుభ్రత, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్త సేకరణలో భాగస్వాములై స్వచ్ఛ గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నర్సయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, కౌన్సిలర్ గుంటుకు శిరీషారాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై డీఈవోకు ఫిర్యాదు

డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న యూత్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

చేర్యాల, డిసెంబర్ 6: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బస్వరాజు కనకయ్య వడ్డీ వ్యాపారం చేస్తూ పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆయన పై విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చందా శ్రీకాంత్ శుక్రవారం డీఈవోకు ఫిర్యాదు చేశారు.కూలీ పనులు చేసుకునే వ్యక్తులకు అధిక వడ్డీకి అప్పులు ఇచ్చి ఖాళీ కాగితాలపై సంతకాలు పెట్టించుకుని, సదరు వ్యక్తులు అప్పు, వడ్డీ కట్టిన తర్వాత కాగితాలు చింపివేయకుండా అతడి వద్దే పెట్టుకుంటున్నాడని తెలిపారు. అతని వద్ద అప్పు తీసుకోకున్నా తప్పుడు కాగితాలు సృష్టించి అప్పు తీసుకొని ఇవ్వడం లేదని తనను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి స్పందించిన డీఈవో బస్వరాజు మండల విద్యాశాఖ అధికారి విచారణ నిర్వహించి వారం రోజుల్లో తనకు నివేదిక అందించాలని ఆదేశించినట్లు విలేకరులకు తెలిపారు.

డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ చైర్మన్ తోట కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, డిసెంబర్ 6: డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ చైర్మన్ తోట కమలాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి టౌన్‌లో యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్ వాల్ పోస్టర్‌ను సిద్దిపేట రన్స్ అసోసియేషన్ నిర్వాహకుడు, రిటైర్డ్ టీచర్ నారాయణరెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నైపుణ్య ఆర్గనైజేషన్ చైర్మన్ మొగుళ్ల ఐలయ్య, సిద్దిపేట రన్స్ అసోసియేషన్ సభ్యుడు కాస రాజు, మిరుదొడ్డి యువజన సంఘాల నాయకులు కుమార్, రమేశ్, బైరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రైతుకు సూచనలు చేస్తున్న ఏవో శ్రీనాథ్

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 6: కత్తెర పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే తీవ్రమైన నష్టం చవిచూడాల్సి వస్తున్నదని మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బూర్గుపల్లి గ్రామంలోని ఓ రైతుకు చెందిన మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు లక్షణాలు గమనించి ఆయన తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనాథ్ మాట్లాడుతూ.. మొక్కజొన్న సాగులో అనేక చీడపీడలు తరచూ ఆశిస్తూ పంటకు నష్టం కలిగిస్తాయని, ఇటువంటి చీడపీడల్లో కత్తెర పురుగు కూడా ఒకటి అన్నారు. దీనిని నివారించేందుకు పురుగు మందులతో పాటు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. మందులను మార్చి మార్చి వాడటం వల్ల మొక్కజొన్నను కత్తెర పురుగు నుంచి కాపాడుకోవచ్చన్నారు.

పర్యావరణ కాలుష్యం మానవ మనుగడకే ప్రమాదం

గజ్వేల్‌లో కాలుష్య నియంత్రణపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గజ్వేల్, డిసెంబర్ 6: పర్యావరణ కాలుష్యం మానవ మనుగడకే ప్రమాదమని జిల్లా నాన్ కమ్యూనికేషన్ డిసీజెస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నారాయణరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పిడిచెడ్ చౌరస్తాలో జాతీయ కాలుష్య నియంత్రణ వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు పర్యావరణ కాలుష్య నియంత్రణ , శబ్దకాలుష్యం వల్ల మనిషికి కలిగే అనర్థాలను తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ బల్వీందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

సిద్దిపేట కలెక్టరేట్: నిరసన దీక్షలో పాల్గొన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబర్ 6: సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సమగ్ర శిక్షా జిల్లా సంఘం అధ్యక్షుడు బాలకిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ వద్ద విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు మూడు రోజులు చేపట్టనున్న దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి సంవత్సరం గడుస్తున్నా ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన దీక్షకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరామ్, గుండు భూపేశ్, సంతోష్, సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షా ఉద్యోగుల సమ్మె సైరన్

జగదేవపూర్, డిసెంబర్ 6: సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు పేస్కేల్ అమలు చేయాలని కోరుతూ విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు దయానంద్ తెలిపారు.శుక్రవారం మండల విద్యాధికారి మాధవరెడ్డికి సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు గోవర్ధన్, రమణ, బాలయ్య, కరుణాకర్, రమ, అరుంధతి, పోచమ్మ పాల్గొన్నారు.

జగదేవపూర్: ఎంఈవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోహెడ, డిసెంబర్ 6: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న విజయోత్సవ సంబురాల్లో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఐదు వందలకే గ్యాస్, ఇంటి అవసరాల కోసం ఉచిత కరెంట్ సరఫరా చేస్తున్నదన్నారు. మండలంలోని తంగళ్లపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను ప్రారంభించుకున్నామని, త్వరలో పనులు పూర్తిచేసి మండల విద్యార్థులకు అందిస్తామన్నారు. పాఠశాలల కమిటీలకు రూ.40 కోట్లు కేటాయించామని, పాఠశాలల్లో మౌలిక వసతులకు రూ.25కోట్ల పనులు పూర్తయ్యాయన్నారు. అంతక ముందు సభకార్యక్రమాన్ని కలెక్టర్ ఆర్డీవో రామ్మూర్తితో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో, ఏసీపీ వాసాల శ్రీనివాస్, ఎస్ అభిలాష్,మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బోయిని నిర్మల, వైస్ చైర్మన్ భీంరెడ్డి తిరుపతిరెడ్డి ,కాంగ్రెస్ నాయకులు చిత్తారి రవీందర్, కేడం లింగమూర్తి, మంద ధర్మయ్య, కంది తిరుపతిరెడ్డి, బోయిని జయరాజ్ పాల్గొన్నారు.

రచయితల సంఘం సభలకు తరలిరండి

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 6: తెలంగాణ రచయితల సంఘం పదేండ్ల సాహిత్య సభలు ఈనెల 8న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరుగుతాయని తెలంగాణ రచయితల సంఘం ప్రతినిధులు తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం రాత్రి సాహిత్య సభల కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య,ప్రధాన కార్యదర్శి యాదగిరి, గౌరవ అధ్యక్షుడు అశోక్, జిల్లా వర్కింగ్ జర్నలిస్టు సంఘం, మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు రంగాచారి,తిరుపతిరెడ్డి, యాదగిరి, రాజిరెడ్డి, భగవాన్‌రెడ్డి,శ్రీనివాస,లాల్‌బదూర్ శాస్త్రి, రాజు మాట్లాడారు. సాహిత్య సభలు ఆదివారం రవీంద్రభారతిలో ప్రారంభమవుతాయన్నారు. సాహిత్య సభలకు జిల్లా నుంచి కవులు, రచయితలు సాహిత్య కారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

సెంట్రింగ్ సంఘం అధ్యక్షుడిగా శ్రీశైలం

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 6 : సెంట్రింగ్ కార్మికుల సమస్యల సాధనకు కృషి చేస్తానని సిద్దిపేట పట్టణ సెంట్రింగ్ సంఘం నూతన అధ్యక్షుడు దూబల శ్రీశైలం అన్నారు. సిద్దిపేట సెంట్రింగ్ సంఘం భవనంలో శుక్రవారం రాత్రి ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా దూబల శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా వెంకటస్వామి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సంఘం నేతలు సత్కరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రవీందర్,మల్లేశం, బ్రహ్మం, నాగరాజు, రాజు పాల్గొన్నారు.

సినిమా థియేటర్ ఎదుట ధర్నా

హుస్నాబాద్, డిసెంబర్ 6: హుస్నాబాద్ పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ ఎదుట డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి శివరాజ్ మాట్లాడుతూ పుష్ప సినిమా టికెట్ల ధరను అమాంతంగా పెంచి ఏకంగా రూ.300 నుంచి రూ.500 వరకు విక్రయిస్తూ ప్రేక్షకులను మోసం చేస్తున్నారన్నారు. థియేటర్ యాజమాన్యానికి చెప్పినా వినకుండా టికెట్ ధరను పెంచి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కేవలం రూ.100 నుంచి రూ.150 ఉండే టికెట్ ధరను రెండురెట్లు పెంచి అభిమానులను ఆర్థికంగా నిలువుదోపిడీ చేస్తున్నారని, వెంటనే థియేటర్ యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక పోలీసుల చొరవతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో నాయకులు రాజునాయక్, అనిల్ నాయక్, జవహర్‌నాయక్, తిరుపతి, గణేశ్ పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారి దేవాలయం వార్షికోత్సవం

మిరుదొడ్డి, డిసెంబర్ 6: మిరుదొడ్డి టౌన్‌లో శుక్రవారం మహంకాళి అమ్మవారి దేవాలయం తొమ్మిదో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.కార్యక్రమంలో పురోహితుడు రాజపున్నయ్య, ఆలయ చైర్మన్ అంజిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

గజ్వేల్: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

సిద్దిపేట టౌన్: అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

హుస్నాబాద్‌టౌన్: హుస్నాబాద్‌లో అంబేద్కర్ వర్ధంతిలో చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న తదితరులు

స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్

జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులు

స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని పలువురు నాయకులు కొనియాడారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

- సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, డిసెంబర్ 6

దుబ్బాకలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి

ధూళిమిట్ట: జాలపల్లిలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళుఅర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తొగుట: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి

మద్దూరు: మర్మాములలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

బెజ్జంకిలో అంబేద్కర్ వర్ధంతిలో పాల్గొన్న అంబేద్కర్ సంఘం, బీఆర్ఎస్ నాయకులు

పుస్తెలతాడు అపహరణ

కొమురవెల్లి, డిసెంబర్ 6: నిద్రిస్తున్న మహిళ నుంచి పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయిన ఘటన కొమురవెల్లిలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన దేశెట్టి తిరుపతమ్మ గురువారం ఇంట్లో ఫంక్షన్ చేసింది. అందరూ భోజనం చేసిన తర్వాత రాత్రి సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి ముందు నిద్రించారు. ఫంక్షన్‌కు వచ్చిన బంధువులు తలుపులు వేయకుండా ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి మద్దూరు మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ప్రియ నుంచి పుస్తెలతాడును దొంగిలించుకొని పారిపోయారు. బాధిత కుటుంబ సభ్యులు కొమురవెల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై రాజు డాగ్‌స్క్వాడ్ సాయంతో ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్6: మద్దూరు మండలం నర్సాయపల్లిలో గురువారం రాత్రి గ్రామానికి చెందిన కవ్వం భాస్కర్ రెడ్డి, చల్లా హన్మంతరెడ్డి, చల్లా బాల్‌రెడ్డి అనే రైతులకు చెందిన ట్రాక్టర్ల బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ రోజు మాదిరిగానే వ్యవసాయ బావుల వద్ద పనులు ముగించుకొని తమ ట్రాక్టర్లను అక్కడే పెట్టి ఇంటికి వచ్చామన్నారు. తెల్లవారుజామున బావి వద్దకు వెళ్లి చూడగా ట్రాక్టర్ల బ్యాటరీలు మాయమైనట్లు వాపోయారు. ఒక్కో బ్యాటరీ విలువ రూ.7వేలు ఉంటుందని, ఉమ్మడి మద్దూరు మండలం వ్యాప్తంగా వరుసగా బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయన్నారు. ఇప్పటికే సుమారు 30 మంది రైతుల ట్రాక్టర్ బ్యాటరీలు చోరీకి గురైనట్లు సమాచారం. బ్యాటరీల దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారని పలువురు మండిపడుతున్నారు.

విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 6: విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి చెందిన ఘటన మద్దూరు మండలంలోని రేబర్తిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొమ్మ రమేశ్‌కు చెందిన పాడిఆవు శుక్రవారం మేత మేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి, డిసెంబర్ 6 : విత్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రవి రోజు మాదిరిగానే శుక్రవారం వ్యవసాయ బావి వద్ద ఆవును మేతకు తీసుకువెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది.

యువకుడి ఆత్మహత్య

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 6 : ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కొండపాక మండలంలోని సిరిసినగండ్లలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చెంది భాను(22) ఇంట్లో తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతూ పనిలేకుండా తిరుగుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నామని తల్లిదండ్రులు చెప్పారు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలి పని ముగించుకొని తల్లిదండ్రులు, చెల్లె ఇంటివి వచ్చి చూసేవరకు అప్పటికే కార్తిక్ మృతిచెందాడు. కాగా మృతుడి తల్లి యాదవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేరస్తుడికి ఆరు నెలల జైలుశిక్ష

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 6: రాయితో తలపై కొట్టి గాయపర్చిన కేసులో నేరస్తుడికి ఆరు నెలల జైలు శిక్ష పడిన సంఘటన త్రీ టౌన్ పీఎస్‌పరిధిలో చోటు చేసుకుంది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం 2016లో వ్యవసాయ పొలం వద్ద జరిగిన గొడవలో రంగధాంపల్లికి చెందిన శ్రీనివాస్ దామోదర్ అనే వ్యక్తిని రాయితో తలపై కొట్టగా గాయమైంది. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం కోర్టు నిందితుడు శ్రీనివాస్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

తనయుడికి జైలుశిక్ష

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 6: ధూళిమిట్ట మండల కేంద్రానికి చెందిన కొండూరి శ్రీనివాస్ అనే వ్యక్తికి హుస్నాబాద్ కోర్టు రెండేండ్లపాటు జైలుశిక్ష విధించినట్లు మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ శుక్రవారం తెలిపారు. గతేడాది శ్రీనివాస్ తన తల్లిని వేధించడంతో మద్దూరు పోలీసులు కేసును మోదు చేసినట్లు తెలిపారు. కేసును విచారించిన హుస్నాబాద్ జడ్జి శ్రీనివాస్‌కు శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 6: విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని ఎన్సాన్‌పల్లిలో చోటు చేసుకుం ది. గ్రామానికి చెందిన పబ్బతి ప్రతాప్ రెడ్డి (60) రోజు మాదిరిగా శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. బోరు మోటార్ ఆన్ చేయగా నడవకపోవడంతో పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేసే క్రమంలో బంపర్ వైరు బంద్ చేసే రాడుపై పడటంతో విద్యుత్‌షాక్ తగిలి కిందపడిపోయాడు. స్థానికులు కుటుంబ సభ్యుల సహాయంతో సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.